మనువాద విధానాలతో దౌర్జన్యాలు

- అన్ని రంగాల్లోనూ దళితులకే అన్యాయం
- సామాజిక అణచివేతను సమైక్యంగా ప్రతిఘటించాలి
- మహిళల పట్ల చిన్నచూపు సమాజ అభ్యున్నతికి ప్రమాదకరం
- డిఎస్ఎంఎం జాతీయ కార్యదర్శి బివి రాఘవులు

సమావేశంలో మాట్లాడుతున్న రాఘవులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్ర ప్రభుత్వ మనువాద విధానాలతో దేశంలో అట్టడుగు వర్గాలకు అన్యాయం జరుగుతోందని, కుల ఆధిపత్య దౌర్జన్యాలు పెరిగిపోతున్నాయని దళిత్ శోషణ్ ముక్తి మంచ్ (డీఎస్ఎంఎం) జాతీయ కార్యదర్శి బివి.రాఘవులు అన్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని స్టార్ బాంకెట్ హాలులో మూడ్రోజుల పాటు నిర్వహించనున్న కెవిపిఎస్ రాష్ట్రస్థాయి సామాజిక శిక్షణా తరగతులను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జెండాను కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తప్పెట్ల స్కైలాబ్ బాబు ఆవిష్కరించారు. కెవిపిఎస్ సూర్యాపేట జిల్లా కార్యదర్శి కోట గోపి అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో రాఘవులు మాట్లాడుతూ.. బిజెపి పాలిత రాష్ట్రాల్లో దళితులపై దుర్మార్గపూరిత దాడులు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కుల దురహంకారులే భయపడే విధంగా అట్టడుగు వర్గాల్లో ప్రతిఘటన చైతన్యం పెరగాలన్నారు. అంబేద్కర్ రాసిన భారత రాజ్యాంగాన్ని అంగీకరించని మనువాద పాలకులు దేశాన్ని ఏలుతున్నారని, రాజ్యాంగాన్ని రద్దు చేయడానికి కుట్రలు చేస్తున్నారని అన్నారు. మనువాద ధర్మం, సనాతన ధర్మం ఎడమ చేయి, కుడి చేయి లాంటివని అన్నారు. భూమి, రిజర్వేషన్లు, ప్రకృతి వనరులు అట్టడుగు వర్గాలకు దక్కకుండా కేవలం కుల సమస్య విడిగా పరిష్కారం కాదన్నారు.

ప్రయివేటు రంగంలో రిజర్వేషన్లు

ప్రయివేటు రంగంలో రిజర్వేషన్లు కల్పించకుండా సామాజిక న్యాయం సాధ్యం కాదని రాఘవులు చెప్పారు. అట్టడుగు వర్గాలకు బడ్జెట్ కేటాయింపులో జనాభా దామాషా ప్రకారం కేటాయింపులు లేవని, కేటాయించినా ఖర్చు కావడం లేదని అన్నారు. సామాజిక న్యాయం కోసం దోపిడీని ఎదిరించే శక్తులతో కలిసి ఉద్యమం చేపట్టాలన్నారు. మహిళల పట్ల చిన్నచూపు సమాజ అభ్యున్నతికి ప్రమాదకరమన్నారు. బిహార్ రాష్ట్రంలో మైనారిటీల ఓట్ల తొలగింపు పౌర ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తుందన్నారు.

ఐక్యతను చాటిన సార్వత్రిక సమ్మె

ఇటీవల దేశవ్యాప్తంగా నాలుగు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా జరిగిన సార్వత్రిక సమ్మె కార్మిక, ప్రజా ఐక్యతను చాటిందని రాఘవులు చెప్పారు. వర్ణాశ్రమ ధర్మాలను అంగీకరించేవారు కుల వివక్షను, సామాజిక అణచివేతను ప్రశ్నించలేరని అన్నారు. సోషలిజం, సెక్యులరిజం బూతు పదాలు కాదని, అవి దేశ సమైక్యత.. సమగ్రతలకు. సామాజిక న్యాయానికి. సంపద పంపిణీకి దోహదం చేస్తాయని వివరించారు. రాబోయే రోజుల్లో దళితులకు రాజ్యాంగబద్ధ హక్కులు, సామాజిక న్యాయం కోసం, భూమి, ప్రయివేటు రంగంలో రిజర్వేషన్ల సాధన కోసం ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

అచ్యుతానందన్ జీవితం స్ఫూర్తిదాయకం

- సిపిఎం కేంద్ర కమిటీ మాజీ సభ్యులు చెరుపల్లి

ప్రజాశక్తి - హైదరావబాద్ బ్యూరో

కేరళ మాజీ ముఖ్యమంత్రి, కమ్యూనిస్టు యోధుడు విఎస్ అచ్యుతానందన్ మరణం పట్ల సిపిఎం కేంద్ర కమిటీ మాజీ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు సంతాపం తెలిపారు. ఆయన, తాను ఒకే సమయంలో కేంద్ర కమిటీలో పనిచేసే అవకాశం వచ్చిందని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన ఒక కార్యదక్షుడని తెలిపారు. 2006 నుంచి 2011 వరకు ఆయన కేరళ ముఖ్యమంత్రిగా పనిచేసినపుడు ప్రజల కోసం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టారని గుర్తు చేశారు. కేరళను అన్ని రంగాల్లో ప్రగతిపథంలో ముందుకు నడిపారని వివరించారు. ఆదర్శంగా జీవించారని తెలిపారు. అచ్యుతానందన్ జీవితం అందరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు.

నేడు విద్యాసంస్థల బంద్

- ఫీజు నియంత్రణ చట్టం తేవాలి
- వామపక్ష విద్యార్థి సంఘాల డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్‌కు వామపక్ష విద్యార్థి సంఘాలు పిలుపునిచ్చాయి. ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కాలేజీలతోపాటు ప్రభుత్వ విద్యాసంస్థల్లో సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాయి. ప్రయివేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలనీ, ఫీజుల నియంత్రణ కోసం చట్టం తేవాలని కోరాయి. విద్యాశాఖకు ప్రత్యేకంగా మంత్రిని నియమించాలని సూచించాయి. విద్యాశాఖలో ఖాళీగా ఉన్న ఎంఇఒ, డిఇఒ, డిప్యూటీఇఒ పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రవేశపెట్టాలని కోరాయి. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని తెలిపాయి. అన్ని ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక వసతులను కల్పించాలనీ, నిధులను కేటాయించాలని డిమాండ్ చేశాయి. బెస్ట్ అవైలబుల్ స్కీం కింద ఉన్న బకాయిలను విడుదల చేయాలని కోరాయి. విద్యార్థులకు ఆర్‌టిసి బస్సుల్లో ఉచిత బస్‌పాస్ సౌకర్యం కల్పించాలని సూచించాయి. ఎన్ఇపి-2020ను రాష్ట్రంలో అమలు చేయకుండా అసెంబ్లీలో తీర్మానం చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాయి. విద్యాసంస్థల బంద్ నేపథ్యంలో రాష్ట్రంలోని కొన్ని ప్రయివేటు పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థులకు సెలవులు ప్రకటించాయి.

ఫిర్యాదుదారులను బెదిరించొద్దు

- డిజిపికి టిజిహెచ్ఆర్‌సి ఆదేశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

చట్టపరంగా పరిష్కారం కోసం వచ్చే ఏ ఫిర్యాదుదారున్ని బెదిరించడం, ప్రభావితం చేయడం, బలవంతం చేయడం మానుకునేలా రాష్ట్రంలోని పోలీసు అధికారులకు స్పష్టమైన సూచనలు జారీ చేయాలని తెలంగాణ మానవ హక్కుల కమిషన్ (టిజిహెచ్‌ఆర్‌సి) రాష్ట్ర డిజిపిని ఆదేశించింది. 2018లో సంతోష్ నగర్ పోలీస్ స్టేషన్‌లో పోలీసు అధికారులు అక్రమంగా నిర్బంధించి, దాడి చేసి, చేయని తప్పు ఒప్పుకోమని బలవంతం చేశారని ఆరోపిస్తూ జి.ప్రశాంత్ కుమార్, మరొకరు దాఖలు చేసిన ఫిర్యాదును కమిషన్ పరిశీలించింది. ఫిర్యాదుదారున్ని విచారించింది. రికార్డులను పరిశీలించింది. ఆ విషయం ప్రస్తుతం కోర్టులో పెండింగ్‌లో ఉన్నప్పటికీ ప్రయివేటు ఫిర్యాదును ఉపసంహరించుకోవాలని పోలీసు అధికారులు బలవంతం, బెదిరింపుల ఆరోపణలు నివారణ చర్యకు అర్హమైనవి కావని కమిషన్ పేర్కొంది. మానవ హక్కుల పరిరక్షణ చట్టం, 1993లోని సెక్షన్ 18 ప్రకారం అటువంటి కేసుల్లో పోలీసుల దుష్ప్రవర్తనను నిరోధించడానికి, ఫిర్యాదుదారుల భద్రతను నిర్ధారించడానికీ, ఆరోపించిన దుష్ప్రవర్తనపై ప్రాథమిక శాఖాపరమైన విచారణను ప్రారంభించడానికి సూచనలు జారీ చేయాలని కమిషన్ డిజిపికి సూచించింది. ఫిర్యాదుదారుడిని వేధించరాదనీ, ఎటువంటి భయం లేకుండా చట్టపరమైన పరిష్కారాలను అనుసరించడానికి వీలు కల్పించాలని కమిషన్ ఆదేశించింది.

బిజెపి బిసిల వ్యతిరేక పార్టీ

- చనగాని దయాకర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిజెపి బిసిల వ్యతిరేక పార్టీ అని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్ రావు వ్యాఖ్యలతో స్పష్టమైందని టిపిసిసి ప్రధాన కార్యదర్శి చనగాని దయాకర్ విమర్శించారు. ఈ మేరకు మంగళవారం ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. బిసి రిజర్వేషన్ల పెంపు బిల్లును రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి పంపించి మూడు నెలలైనా దానిపై చర్చించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. 1980లో మండల్ కమిషన్‌ను వ్యతిరేకించిన బిజెపి మళ్లీ బిసి బిల్లును కూడా వ్యతిరేకిస్తున్నదని తెలిపారు. ప్రజలు బిజెపికి తగిన బుద్ధి చెబుతారని ఆయన హెచ్చరించారు.

దాశరథి విగ్రహ ప్రతిష్టాపనకు చర్యలు

దేవేందర్‌కు పురస్కారం అందజేస్తున్న మంత్రులు

- గ్రామ పంచాయతీ గ్రంథాలయాల్లో దాశరథి రచనలు
- సాంస్కృతిక పర్యాటక శాఖ మంత్రి జూపల్లి
- ప్రముఖ కవి అన్నవరం దేవేందర్‌కు దాశరథి సాహితీ పురస్కారం ప్రదానం

ప్రజాశక్తి - కల్చరల్

మహాకవి దాశరథి కృష్ణమాచార్య విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై ప్రతిష్టించేందుకు కార్యాచరణ ప్రారంభించినట్టు సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. హైదరాబాద్ రవీంద్రభారతిలో మంగళవారం భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో దాశరథి శత జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రముఖ కవి అన్నవరం దేవేందర్‌కు దాశరథి సాహితీ పురస్కారాన్ని మంత్రులు బహుకరించారు. అనంతరం మంత్రి జూపల్లి మాట్లాడుతూ.. తెలంగాణ నేలపై ఉద్యమించిన సాహితీ కిరణం దాశరథి కృష్ణమాచార్య అన్నారు. దాశరథి రచనలను రాష్ట్ర వ్యాప్తంగా 12,000 పంచాయతీల గ్రంథాలయాల్లో అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. రాష్ట్రంలోని సాహిత్య ప్రముఖుల రచనల ప్రచారానికి తనకు వార్షికంగా వచ్చే నిధుల నుంచి రూ.కోటి కేటాయిస్తానని ప్రకటించారు. అలాగే, యువతలో క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించేందుకు మరో కోటి రూపాయలు వెచ్చిస్తానని తెలిపారు. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. దాశరథి తెలంగాణ ఉద్యమానికి స్ఫూర్తి అని చెప్పారు. ఆయన ప్రభావంతో ఎందరో కవులు సామాజిక స్పృహతో రచనలు చేశారని, అందులో అవార్డు గ్రహీత దేవేందర్ ఒకరని చెప్పారు. కవి జయరాజ్ మాట్లాడుతూ.. దాశరథి "అన్నార్తులు అనాథలు" లేని కాలం ఊహించారని, అది ప్రభుత్వం సాకారం చేస్తే దాశరథికి సరైన గుర్తింపని చెప్పారు. కవి యాకూబ్ మాట్లాడుతూ.. దాశరథి గీతం "ఆ చల్లని సముద్ర గర్భంలో.." జాతి జనులు పాడుకునే మంత్రంలా మారిందన్నారు. స్వాగతం పలికిన సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ మామిడి హరికృష్ణ మాట్లాడుతూ.. దాశరథి అవార్డుకు ఎంపికైన దేవేందర్ తెలంగాణ సాంస్కృతిక జీవన చిత్రాన్ని తన రచనల్లో చూపారని వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గీత రచయిత అందెశ్రీ, దాశరథి తనయుడు లక్ష్మణ్, కుమార్తె ఇందిర తదితరులు పాల్గొన్నారు.

కల్లు గీత కార్మికులకు ఎక్స్‌గ్రేషియా ఎప్పుడిస్తారు?

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో కల్లుగీత కార్మికులు తీవ్రమైన ఇబ్బందులకు గురవుతున్నారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ ఆందోళన వ్యక్తం చేశారు. వృత్తిలో భాగంగా అనేక విధాలుగా వారు ప్రమాదాలకు గురవుతున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వారిని ఆదుకునే పరిస్థితి లేదని పేర్కొన్నారు. ప్రమాదాలకు గురైన కార్మికులకు ఎక్స్‌గ్రేషియా ఎప్పుడిస్తారని ప్రశ్నించారు. ప్రభుత్వానికి మొర పెట్టుకుంటున్నా హామీలే తప్ప అమలు చేయడం లేదని విమర్శించారు. ప్రమాదాలకు గురైన వారికి తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కాలంలో దాదాపు 710 మంది వృత్తిదారులు ప్రమాదాలకు గురైతే 130 మంది చనిపోయారని వివరించారు. 120 మంది శాశ్వత వికలాంగులయ్యారని తెలిపారు. సుమారు 460 మంది వికలాంగులయ్యారని పేర్కొన్నారు.

వారికి రూ.12.96 కోట్ల నిధులను విడుదల చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తున్నదని విమర్శించారు. ఎక్స్‌గ్రేషియా నిధులను విడుదల చేయాలని గీత కార్మిక సంఘాల ఆధ్వర్యంలో అనేక రూపాల్లో ఆందోళనలు, నిరాహార దీక్షలు జరిగాయని గుర్తు చేశారు. అధికారులను కలిసినా ప్రయోజనం లేదని తెలిపారు. గతేడాది జులై 14న లష్కర్‌గూడలో జరిగిన కాటమయ్య రక్షణ కవచం పథకం ప్రారంభ సభలో ఎక్స్‌గ్రేషియా విషయం సిఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తే అదే సభలో ఆ రోజే నిధులను విడుదల చేస్తామంటూ ప్రకటించారని పేర్కొన్నారు. ఏడాది గడిచినా ఇప్పటికీ ఆ హామీ అమలు కాలేదని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తక్షణమే స్పందించి గీత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నిధులను విడుదల చేయాలని కోరారు.

రాష్ట్రంలో అడ్వైజరీ సంస్థలతో మరింత వృద్ధి

హైదరాబాద్ : తెలంగాణలో ప్రమోటర్ ఆధారిత సంస్థలు అడ్వైజరీ సంస్థల సహాయంతో 30-50 శాతం వృద్ధి సాధించవచ్చని ఎవర్‌ఫ్లోరిష్ అడ్వైజర్స్ కోఫౌండర్ సచిన్ జైన్ రమ్నిష్ పేర్కొన్నారు. ఫార్మా, ఐటి, టెక్స్‌టైల్స్, తయారీ రంగాల్లో పెట్టుబడులను ఆకర్షిస్తున్న తెలంగాణలో అడ్వైజరీ సంస్థలు ఐపిఒ కోసం గవర్నెన్స్ మెరుగుపరచడంలో కీలక పాత్ర పోశిస్తున్నాయన్నారు.

రూ. 200 కోట్లకు చేరిన ఉచిత బస్సు ప్రయాణం

- ఆర్‌టిసి సిబ్బందికి సిఎం రేవంత్ అభినందనలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మహాలక్ష్మి పథకం కింద ఉచిత బస్సు ప్రయాణం రూ. 200 కోట్ల జీరో టికెట్ల మైలు రాయిని చేరుకుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎక్స్ వేదికగా ప్రకటించారు. ఈ లక్ష్య సాధనలో తెలంగాణ ఆర్‌టిసి సిబ్బందిని ఆయన అభినందించారు. "18 నెలల ప్రజా పాలనలో రూ. 200 కోట్ల జీరో టికెట్ల మైలురాయి...ఆడబిడ్డల ఉచిత బస్సు ప్రయాణ పథకం విజయవంతంగా కొనసాగుతుండటం ఆనందంగా ఉంది. ఈ పథకంలో లబ్ధిదారులైన ప్రతి ఆడబిడ్డకు నా అభినందనలు. పథకాన్ని దిగ్విజయంగా అమలు చేయడంలో భాగస్వాములైన ఆర్‌టిసి కార్మికులు, సిబ్బందికి ప్రత్యేక అభినందనలు" అని పేర్కొన్నారు.

ప్లాస్టిక్ శానిటరీ ప్యాడ్స్‌తో ముప్పు

- ప్రత్యామ్నాయాలపై దృష్టి సారించాలి
- సెయింట్ ఆన్స్ కాలేజీలో విజయవంతంగా అవగాహన సదస్సు

ప్రజాశక్తి - హైదరాబాద్

రుతుక్రమ వ్యర్థాలు మానవ ఆరోగ్యం, పర్యావరణంపై చూపే ప్రభావం వంటి అంశాలపై సుదీర్ఘకాలంగా నెలకొన్న నిశ్శబ్దాన్ని ఛేధించడానికి సెయింట్ ఆన్స్ కాలేజ్ ఫర్ ఉమెన్‌లో జరిగిన 'పీరియడ్. ప్లానెట్. పవర్. ఎకో ఎడిషన్' విజయవంతమయ్యిందని నిర్వాహకులు తెలిపారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో రుతుక్రమ వ్యర్థాలపై అపోహలను తొలగించి, ప్లాస్టిక్‌తో కూడిన శానిటరీ ప్యాడ్‌ల వల్ల పర్యావరణానికి, ఆరోగ్యానికి కలిగే హానిని గురించి అవగాహన కల్పించారు. భారత్‌లో ఏటా లక్ష టన్నులకు పైగా రుతుక్రమ వ్యర్థాలు పోగవుతున్నాయని, పర్యావరణ హితమైన ప్రత్యామ్నాయాలపై దృష్టి పెట్టాలని పద్మశ్రీ అవార్డు గ్రహీత, డాక్టర్ మంజుల అనగాని పేర్కొన్నారు. 'నో ప్లాస్టిక్ ఆన్ ప్రయివేటు' పేరుతో ప్రచారాన్ని కల్పిస్తున్నామన్నారు.

వచ్చే మూడ్రోజులు అతిభారీ వర్షాలు

- పలు జిల్లాలకు ఆరెంజ్, ఎల్లో హెచ్చరికల జారీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో వచ్చే మూడ్రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు పలుచోట్ల, ఎక్కువ ప్రాంతాల్లో మోస్తరు వానలు పడే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రధాన అధికారి డాక్టర్ కె.నాగరత్న హెచ్చరించారు. బుధవారం ఆదిలాబాద్, కొమ్రంభీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో అక్కడక్కడా భారీ నుంచి అతి భారీ వర్షాలు పడే సూచనలున్న నేపథ్యంలో ఆ జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరిక జారీ చేశారు.

నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్నసిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, వికారాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో భారీ వర్షాలు పడే అవకాశముండటంతో ఎల్లో హెచ్చరిక విడుదల చేశారు. 24న ఆదిలాబాద్, కొమ్రంభీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, వికారాబాద్ జిల్లాల్లో భారీ వర్షాలు పడొచ్చని పేర్కొన్నారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో వచ్చే 48 గంటల పాటు ఆకాశం మేఘావృతమై ఉంటుంది. సాయంత్రం, రాత్రి సమయాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశముందని తెలిపారు. అదే సమయంలో వర్షాలు పడే ప్రాంతాల్లో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో కూడిన ఈదురు గాలులు వీయొచ్చని సూచించారు.

మంగళవారం ఉదయం 8:30 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు రాష్ట్రంలో 400కిపైగా ప్రాంతాల్లో వర్షం కురిసింది. ములుగు జిల్లా వెంకటాపురం మండల కేంద్రంలో అత్యధికంగా 11.35 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. మంచిర్యాల, కొమ్రం భీమ్ అసిపాబాద్, మంచిర్యాల, భద్రాద్రికొత్తగూడెం, వరంగల్ జిల్లాల్లో పలు చోట్ల భారీ వర్షం కురిసింది.

బాలికపై లైంగిక దాడి

- నిందితుడి అరెస్ట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్న బాలికపై వలస కార్మికుడు లైంగికదాడి చేశాడు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం పోలీస్‌స్టేషన్ ఎదురుగా నేషనల్ హైవే బ్రిడ్జి కింద మంగళవారం జరిగింది. స్టేషన్ హౌస్ ఆఫీసర్ కె.బాలరాజు తెలిపిన వివరాల ప్రకారం.. బెంగళూరు జాతీయ రహదారి బ్రిడ్జి కింద పదేళ్ల బాలిక తన కుటుంబ సభ్యులతో కలిసి యాచిస్తూ (బిక్షాటన) చేస్తూ జీవిస్తున్నది. గుజరాత్ రాష్ట్రానికి చెందిన సంజయ్ అలియాస్ ఇర్ఫాన్ హుస్సేన్ (24) కొన్నేళ్ల కిందట బతుకుదెరువు కోసం శంషాబాద్‌కు వలస వచ్చాడు. ఇతను తెల్లవారుజామున మద్యం మత్తులో ఆ బాలికపై లైంగిక దాడికి ఒడిగట్టాడు. ఈ దారుణంపై కుటుంబ సభ్యులు, స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ఎస్ఐ బాలరాజు తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని నిందితుడిని అరెస్టు చేశారు. బాలికను ఆస్పత్రికి తరలించి వైద్య పరీక్షలు చేయించారు. లైంగికదాడి జరిగినట్టు వైద్యులు నిర్ధారించారు. నిందితుడిపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు.

తగ్గిన టెట్ ఉత్తీర్ణత

- అర్హత సాధించని 77,737 మంది విద్యార్థులు
- ఫలితాలు విడుదల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) ఫలితాలను మంగళవారం హైదరాబాద్‌లో విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా విడుదల చేశారు. గతేడాది కంటే ఇప్పుడు టెట్‌లో ఉత్తీర్ణత తగ్గింది. గతనెల 18 నుంచి 30 వరకు టెట్ రాతపరీక్షలను ఆన్‌లైన్‌లో నిర్వహించిన విషయం తెలిసిందే. టెట్ పేపర్-1కు 63,261 మంది దరఖాస్తు చేయగా, 47,224 మంది అభ్యర్థులు హాజరయ్యారు. వారిలో 29,043 (61.50 శాతం) మంది ఉత్తీర్ణత పొందారు. టెట్ పేపర్-2కు 1,20,392 మంది దరఖాస్తు చేస్తే 90,205 మంది హాజరయ్యారు. వారిలో 30,649 (33.98 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. ఇందులో పేపర్-2 మ్యాథ్స్, సైన్స్‌కు 66,686 మంది దరఖాస్తు చేస్తే 48,998 మంది పరీక్షకు హాజరయ్యారు. వారిలో 17,574 (35.87 శాతం) మంది ఉత్తీర్ణత సాధించారు. టెట్ పేపర్-2 సోషల్ స్టడీస్‌కు 53,706 మంది దరఖాస్తు చేయగా, 41,207 మంది పరీక్ష రాశారు. వారిలో 30,649 (31.73 శాతం) మంది అర్హత పొందారు. గత టెట్‌లో పేపర్-1లో 67.13 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. దీంతో ఈసారి టెట్ పేపర్-1లో గతం కంటే 5.53 శాతం ఉత్తీర్ణత తగ్గడం గమనార్హం. గత టెట్‌లో పేపర్-2లో 34.18 శాతం ఉత్తీర్ణులయ్యారు. దీంతో ఈసారి టెట్ పేపర్-2లో గతం కంటే 0.2 శాతం ఉత్తీర్ణత తగ్గింది. టెట్ ఫలితాల కోసం https://schooledu.telangana.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని పాఠశాల విద్యాశాఖ సంచాలకులు, టెట్ చైర్‌పర్సన్ ఈ నవీన్ నికోలస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌సీఈఆర్‌టి డైరెక్టర్ రమేష్ పాల్గొన్నారు.

2035 నాటికి సగం మంది ఊబకాయులే

- ఒబెసిటీపై 600 మంది పరిశోధకుల అధ్యయనం
- రీసెర్చ్ టీంలో సిసిఎంబి శాస్త్రవేత్త డాక్టర్ గిరిరాజ్ రతన్ చందక్ బృందం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రపంచవ్యాప్తంగా ఊబకాయం పెద్ద అనారోగ్య సమస్యగా అవతరిస్తున్నది. చిన్నారుల నుంచి పెద్ద వయస్సు వారి వరకు ఎవ్వరినీ వదిలిపెట్టడం లేదు. అధిక బరువుతో సామాజిక వివక్షతో పాటు మధుమేహం, గుండె సంబంధిత రుగ్మతలు, ఎముకలు బలహీనపడటం, పునరుత్పత్తి సమస్యలు, క్యాన్సర్ వంటి రోగాల బారిన వారు పడటానికి కారణమవుతున్నది. 2035 నాటికి ప్రపంచ జనాభాలో సగం మంది ఊబకాయానికి గురవుతారని వరల్డ్ ఒబెసిటీ ఫెడరేషన్ అంచనా వేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా శాస్త్రవేత్తలు ఊబకాయం నుంచి ప్రజలను రక్షించే దిశగా పరిశోధనలు మొదలు పెట్టారు. ఈ పరిశోధనల్లో హైదరాబాద్‌కు చెందిన సీఎస్ఐఆర్ -సీసీఎంబీ నుంచి డాక్టర్ గిరిరాజ్ రతన్ చందక్ తన బృందంతో పాల్గొన్నారు.

గతంలో ఎప్పుడు లేని విధంగా అంతర్జాతీయంగా 600 మంది పరిశోధకులు, 500 సంస్థలు భారతదేశంతో సహా వివిధ దేశాలకు చెందిన 50 లక్షల మంది విభిన్నమైన జన్యువులను విశ్లేషించారు. ఆధునిక జన్యు పరీక్ష అయిన పాలిజెనిక్ రిస్క్ స్కోర్ పరీక్షల ద్వారా ఊబకాయానికి గురయ్యే అవకాశమున్న చిన్నారులను గుర్తించేందుకు ప్రయత్నించారు. తద్వారా పెద్దాయ్యాక ఊబకాయానికి గురి కాకుండా అవసరమైన జీవనశైలిని మార్చుకునేలా సూచనలు చేసేందుకు ఈ పరిశోధన ఉపయోగపడుతుందని శాస్త్రవేత్తలు తెలిపారు.

ఊబకాయానికి సంబంధించి యూరోప్‌తో పోలిస్తే భారతదేశంలో భిన్నంగా ఉన్నట్టు ఈ పరిశోధనల్లో గుర్తించారు. జన్యుకారణాలతో ఊబకాయం ఎదుర్కొంటున్న వారికి, బరువు తగ్గే జీవనశైలిని అలవాటు చేసుకున్న వారికి మధ్య తేడాలను శాస్త్రవేత్తలు గుర్తించారు. ఆహార నియమాలు, వ్యాయామం మానివేయగానే వారంతా పూర్వపు ఊబకాయం దశకు చేరుకున్నట్టు పరిశోధనల్లో తేలింది. భారతీయులు ఎదుర్కొంటున్న ఊబకాయ సమస్యకు ముందు నుంచి ఆహార నియమాలు పాటిస్తూ వ్యాయామం చేయడం మంచిదని డాక్టర్ చందక్ సూచించారు.

గౌరవనీయులైన జమ్మలమడుగు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో

O.S.No. 149/2020

బొడ్డు నాగరాజు తండ్రి చిన్న వెంకట రమణ వయస్సు 56 సంవత్సరాలు, హిందూ, వ్యాపారం, డోర్.నెం.4/964, నెహ్రూనగర్ వీధి, జమ్మలమడుగు పట్టణం మరియు మండలం, YSR కడప జిల్లా. ...వాది

Vs

పట్నం వెంకట రమణయ్య తండ్రి పట్నం సంటెన్న, వయస్సు 40 సంవత్సరాలు, హిందూ, పోస్టల్ అసిస్టెంట్, దిల్సు క్ నగర్ పోస్టాఫీసు, ప్రధాన పోస్టాఫీసు, హైదరాబాద్. 500060. తెలంగాణ రాష్ట్రం. ...ప్రతివాది

దావా సమను

ఈ నెంబరు దావాలోని వాది, ప్రతివాది అయిన మీపైన ప్రామీసరినోటు మొత్తం అమౌంట్ రూ.51,520/-లు కోసం రాజశ్రీ పై కోర్టునందు దావా దాఖలు చేశారు. అట్టి దావాలో ప్రతివాది అయిన మీరు రాజశ్రీ కోర్టువారి సమన్లు తీసుకోకుండా కాలయాపన చేయునందున, ఈ దావా సమను ద్వారా మీకు తెలియజేయడం ఏమనగా మీరు హాజరు ఆగుటకు గాను 04.08.2025 తేదిన వాయిదా ఉన్నది. పై తేదీన ఉదయం 10.30 గంటకు మీరు పైన తెలిపిన కోర్టునందు హజరై ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల మీరు గానీ, మీ వకలు ద్వారా గాని తెలుపుకొనవచ్చును. లేనంత మీకు పరోక్షముగా కోర్టువారు తీర్మానించుదురు.

వాయిదా తేదీ : 04.08.2025.

//బై ఆర్డర్ ఆఫ్ ది కోర్టు//

టి. కిషోర్,
వాది తరపు న్యాయవాది, జమ్మలమడుగు.

మహారాజశ్రీ మార్కాపురం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S.NO: 230/2024

మండ్లా బాల అంకయ్య ...వాది

వర్సస్

కాసులనాటి నాగాప్రసున ...ప్రతివాది

టు,

ప్రతివాది చిరునామా :

ప్రతివాది) కాసులనాటి నాగాప్రసున
భర్త కాసులనాటి వెంకట సుబ్రహ్మణ్యం,
వయసు సుమారు 50 సంవత్సరాలు,
ప్లాట్ 55, బ్రిన్దవన్ కాలనీ, నిజాం పేట్ రోడ్,
కూకట్ పల్లి, హైదరాబాద్, తెలంగాణా రాష్ట్రం

పై నెంబరు దావాలో వాది దావా ప్లైంటు పరిహారం రాగోరి మీ పై మార్కాపురం జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో దావా దాఖలు చేసినందున, సదరు దావాలో మీరు పై కోర్టుకు హాజరై మీ ఆక్షేపణలు తెలుపుటకు వాయిదా 11వ తేదీ ఆగష్టు నెల 2025 సం: లో ఉన్నది. మీరు ఆ వాయిదా రోజు ఉదయం 10:30 గంటలకు మీరు స్వయంగా గాని లేదా మీ వకీలు గారి ద్వారా గాని పై కోర్టుకు హాజరై మీ ఆక్షేపణలుంటే తెలుపుకునేది, లేని చో మీ పరోక్షమునందు దావా విమర్శించి తీర్మానించబడును.

// శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

మార్కాపురం
తేదీ 22-07-2025

ఇట్లు
శ్రీ షేక్ యాసిన్ బాషా,
వాది తరుపు అడ్వకేట్,
సెల్ నెం. 9346513649

దావా సమన్లు

IN THE COURT OF THE HON'BLE PRL. CIVIL JUDGE(JUNIOR DIVISION):: GUNTUR

OS No:963/ 2023

Between:
State Bank Of India, RACPC, Guntur,
Rep.by it's Chief Manager. ...Plaintiff
And
Bommidi Satyanarayana & Another
..... Defendants

To.
D-1: Bommidi Satyanarayana,
S/o. Eeswara Rao,
D-2: Bommidi Sirisha,
W/o. Satyanarayana, Both are R/o.Plot No. C-109, Hill Colony, Near Ganesh Temple, Vanastalipuram, Hyderabad-500070

పై నెంబరు దావాను వాది, బ్యాంకుకు రావలసిన బాకీ వసూలు నిమిత్తం దాఖలు చేయగా సదరు దావాలో ప్రతివాదులు అయిన మీకు పై కోర్టు నుండి దావా సమన్లు పంపించినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున మీకు సమన్లు ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియజేయమని ది: 21-08-2025 కి వాయిదా వేసినారు.కావున ఆ రోజున ఉ. గం.10-30 ని.లకు పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గానీ లేక మీ వకీలు గారి ద్వారా గానీ హాజరై మీకు గల ఆక్షేపణలను తెలుపుకొనగలరు. లేనిచో శ్రీ కోర్టు వారిచే చట్ట ప్రకారం మీ పరోక్షంగా విచారించి తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

వాయిదా తేది:21-08-2025

కె.వి.ఆర్.హెచ్.ప్రసాద్,
వాది తరపు అడ్వకేట్,
రవీంద్ర నగర్, గుంటూరు.

రంగారెడ్డిలో దరఖాస్తు చేస్తే.. ఆసిఫాబాద్‌లో సీటు

- విద్యార్థులకు తలనొప్పిగా గురుకులాల్లో ప్రవేశాల ప్రక్రియ
- పాతపద్ధతిలో సీట్లు కేటాయించాలని విన్నపం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రస్తుత విద్యాసంవత్సరంలో సాంఘిక సంక్షేమ గురుకులాల్లో ప్రవేశాల ప్రక్రియ విద్యార్థులకు తలనొప్పిగా మారింది. 'పాతొక రోత..కొత్తొక వింత' నానుడిని వంటపట్టించుకున్న అధికారులు..పాత విధానానికి తిలోదకాలిచ్చి కొత్త నిబంధనలకు శ్రీకారం చుట్టారు. ఆ నిబంధన విద్యార్థులకు తలనొప్పిగా మారింది. రంగారెడ్డి జిల్లాలో దరఖాస్తు చేసుకుంటే ఆసిఫాబాద్ జిల్లాలో సీటు రావడంతో బేజారెత్తిన విద్యార్థి..ఇక చదువుకు స్వస్తి చెప్పటం తప్ప మరో మార్గం లేదని కన్నీటి పర్యంతమవుతున్నాడు. ఇది ఒక విద్యార్థి వేదన మాత్రమే కాదు..వేల మంది విద్యార్థుల పరిస్థితీ ఇదే..జిల్లాలకు జిల్లాలు దాటి సుదూర ప్రాంతంలో సీటు కేటాయించటంపై వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రవేశాల తీరుతో..చదువుకు దూరం

ఈ సారి అడ్మిషన్ల విధానాన్ని మార్చడంతో ఎక్కువ మంది విద్యార్థులు వచ్చిన సీటును వదులుకుంటున్నారు. ఇది విద్యార్థుల చదువుపై తీవ్ర ప్రభావం చూపుతుంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఎస్‌సి, ఎస్‌టి, బిసి, జనరల్ గురుకులాల్లో ఐదో తరగతిలో ప్రవేశాల ఎంపిక ప్రక్రియ నిర్వహించారు. జిల్లాల వారీగా మెరిట్‌తో కాకుండా, రాష్ట్ర మెరిట్ ఆధారంగా సీట్లను కేటాయించారు. నిజామాబాద్ జిల్లా విద్యార్థికి ఆదిలాబాద్‌లో, కామారెడ్డి విద్యార్థికి ఖమ్మంలో, మహబూబ్ నగర్ విద్యార్థికి మరో జిల్లాలో అడ్మిషన్లు ఇచ్చారు. ఇంటర్ ప్రవేశాల్లోనూ ఎస్‌సి గురుకులం ఇదే రీతిన కొనసాగించింది. దీంతో విద్యార్థులకు తమ సొంత జిల్లాలో కాకుండా ఎక్కడెక్కడో సీట్లు రావడంతో ఇంటిపై బెంగ పెట్టుకున్నారు. ఈ క్రమంలో గురుకులంలో ఉండలేక ఆందోళనకు గురవుతున్నారు.

విద్యార్థుల విముఖత

ఎస్‌సి గురుకుల పరిధిలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సిఒఇ), సాధారణ ఇంటర్, ఒకేషనల్ జూనియర్ కాలేజీలు కలిపి మొత్తంగా 238 గురుకులాలు ఉన్నాయి. అన్ని గ్రూపులు కలిపి 19,490 సీట్లు ఉన్నాయి. అత్యధికంగా ఎంపిసికి 8,360, బైపిసికి 7,880 సీట్లు ఉండగా, మిగతావి ఎంఇసి, సిఇసి గ్రూపులవి. ఏప్రిల్‌లో అడ్మిషన్ల కోసం దరఖాస్తులు స్వీకరించారు. ఇప్పటికే తొలిదశలో అన్ని సీట్లకు అభ్యర్థులను ఎంపిక చేసి అలాట్‌మెంట్ ఆర్డర్లను సొసైటీ జారీచేసింది. కానీ చాలా మంది విద్యార్థులు అడ్మిషన్ పొందలేదని తెలుస్తున్నది. చేరిన వారిలోనూ అనేక మంది కేవలం జిరాక్స్ పత్రాలను మాత్రమే సమర్పించి వెళ్లారు. పూర్తిస్థాయిలో అడ్మిషన్ పొందలేదని గురుకుల ప్రిన్సిపళ్లు చెబుతున్నారు. నీట్, జెఇఇ తదితర పోటీ పరీక్షలకు శిక్షణ అందించే సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సిఒఇ)ల్లో ఈ ఏడాది సీట్లు పూర్తిగా భర్తీ కాలేదని తెలుస్తున్నది.

సొసైటీ నిర్ణయాల ఫలితమే

గురుకుల ఇంటర్ ప్రవేశాలు పూర్తిగా పడిపోవడానికి, విద్యార్థులు విముఖత చూపేందుకు ప్రధాన కారణం ఎస్‌సి గురుకుల సొసైటీ ఇష్టారీతిన తీసుకున్న నిర్ణయాలేనని గురుకుల సిబ్బంది వెల్లడిస్తున్నారు. ఈ ఏడాది రాతపరీక్షను రద్దు చేసింది. సొసైటీ విద్యార్థులకే సిఒఇల్లో ప్రవేశాలను కల్పించింది. గతంలో అడ్మిషన్ పొందిన విద్యార్థులను కూడా ఇంటర్ మొదటి సంవత్సరంలో మార్కులు సరిగా సాధించలేదని చెప్పి ఇతర సాధారణ గురుకులాలకు మార్చారు. ఇక నాన్ సిఒఇ, ఒకేషనల్ గురుకుల కాలేజీల్లో ప్రవేశాల ప్రక్రియను కూడా అడ్డదిడ్డంగా చేపట్టారు. దాదాపు 80 గురుకుల కాలేజీల్లో గ్రూపులన్నీ మార్చారు. ఎంపిసి, బైపిసి, సిఇసి, ఎంఇసితోపాటు, ఒకేషనల్ కోర్సుల్లోనూ మార్పు చేర్పులు చేశారు. కొన్ని కాలేజీలను కేవలం సైన్స్ గ్రూపులకు, మరికొన్ని కాలేజీలను ఆర్ట్స్ గ్రూపులకు పరిమితం చేశారు. మరికొన్నింటిలో మిశ్రమ కోర్సులు రన్ చేయాలని నిర్ణయించారు. ఇంటర్ కాలేజీల అడ్మిషన్ కోసం దరఖాస్తు చేసుకునే సమయంలో విద్యార్థులకు ఇవేవీ వెల్లడించలేదు. వాస్తవంగా గతంలో దరఖాస్తులు స్వీకరించే సమయంలో సదరు విద్యార్థికి ఏ జిల్లాలో? ఎక్కడ ఏ కాలేజీలో, ఏ గ్రూపులో సీటు పొందాలనుకుంటున్నాడు? అనే అంశాలపై ప్రాధాన్యతపరంగా ఆప్షన్ ఎంచుకునే అవకాశముండేది. విద్యార్థులు కూడా ఆయా కాలేజీల్లోని వసతులు, ఉత్తీర్ణతతోపాటు, దూర భారం లేని కాలేజీలను ఎంపిక చేసుకుని ఆ విధంగానే దరఖాస్తులు తీసుకునేవారు. కానీ ప్రస్తుతం తీసుకునే గ్రూపు తప్ప కాలేజీని ఎంచుకునే అవకాశాన్ని సొసైటీ దరఖాస్తు సమయంలో ఇవ్వలేదు. సొసైటీనే మెరిట్ ఆధారంగా ఇష్టారీతిన విద్యార్థులకు ఆయా కాలేజీలకు కేటాయించింది. పొంతన లేకుండా సుదూర ప్రాంతాల్లో సీట్లను కేటాయించింది. ఈ కారణంగానే విద్యార్థులు అడ్మిషన్‌కు విముఖత చూపుతున్నారని తెలిసింది. ఇప్పటివరకు అడ్మిషన్ పొందిన వారు కూడా తమ సొంతజిల్లాలకే బదిలీ పెట్టుకుంటున్నారని సమాచారం.

సమయపాలన నియమంతో ఒత్తిడి

గురుకులాల్లో సమయపాలన విధానం విద్యార్థులపై తీవ్ర మానసిక ఒత్తిడి పెంచుతున్నదని తెలుస్తున్నది. దీంతో రోబోల్లా తయారవుతున్నారనే చర్చ జరుగుతున్నది. గురుకుల సమయ పాలనను మార్చి విద్యార్థులకు ఆహ్లాదకర వాతావరణం లేకుండా చేయడంతో వారు ఆందోళనకు గురవుతున్నారు. మొత్తం 16 గంటల షెడ్యూల్లో కనీసం 2.30 గంటల పాటైనా పర్సనల్ టైమ్ లేదనీ, అందులోనే బ్రేక్ ఫాస్ట్, లంచ్, డిన్నర్ పూర్తి చేయాల్సి ఉంటుందనీ, ఇది విద్యార్థుల మానసిక స్థితిపై తీవ్ర ప్రభావం చూపుతున్నదని ఉపాధ్యాయులు చెబుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఉదయం తరగతులు ప్రారంభమైన తరువాత గంటన్నరకు చిన్న విరామం, మూడున్నర గంటల తర్వాత తిరిగి భోజన విరామం, ఆ తర్వాత గంటన్నర తర్వాత తిరిగి చిన్న విరామం ఉంటుంది.

విద్యార్థుల బాధలు ఆలకించని అధికారులు

సవాలక్ష సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న గురుకుల సొసైటీలను బాగు చేయకపోగా కొత్త నిబంధనలు తీసుకొచ్చి పేద విద్యార్థులను పరోక్షంగా చదువుకు దూరం చేసే చర్యల పట్ల తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు విద్యార్థుల బాధలను అధికారులు ఆలకించాలి. వాటిని పరిష్కరించేందుకు పూనుకోవాలి. అప్పుడే గురుకులాల నిర్వాహణ లక్ష్యం నెరవేరుతుంది.

వార్డెన్ కుమారుడి అరాచకం

- బాలికల హాస్టల్‌లో అసభ్యకర ప్రవర్తన
- పోలీసులకు ఫిర్యాదు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నారాయణఖేడ్ బిసి బాలికల హాస్టల్‌లో వార్డెన్ కొడుకు అరాచకాలు పెరుగుతుండగా.. అతనికి సిబ్బంది వంత పాడుతున్నారు. తమ పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నట్టు విద్యార్థినులు పోలీస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో బీసీ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ జగదీష్ మంగళవారం హాస్టల్‌ను సందర్శించి వివరాలు సేకరించారు. బాలికలు తెలిపిన, ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం.. హాస్టల్‌లో 50 మంది బాలికలు ఉన్నారు. వార్డెన్ కుమారుడు రాజేష్ మున్సిపల్ పట్టణంలో కౌన్సిలర్‌గా పనిచేశారు. 'వార్డెన్ ఎప్పుడూ రారు.. ఎవరైనా అధికారులు వస్తేనే వస్తారు.. హాస్టల్‌కు వార్డెన్ కుమారుడే వస్తూ ఉంటాడు.. రోజూ రాత్రి 10 గంటల వరకు హాస్టల్‌లోనే ఉంటాడు..' అని విద్యార్థినులు తెలిపారు. ఆ సమయంలో తమ పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడని పలువురు బాలికలు ఆవేదన వ్యక్తం చేశారు. హాస్టల్ సిబ్బందికి చెప్పినా ఆయనకే వత్తాసు పలుకుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన ఎక్కడ చేయి వేస్తే మీకేంది.. అన్నలా భావించాలని చెబుతున్నారని ఆవేదన వెలిబుచ్చారు. తాము ఇంటికి వెళ్లి వచ్చిన సమయంలో కొంచెం ఆలస్యమైనా వార్డెన్ కొడుకు అనరాని మాటలు అంటున్నారని చెప్పారు. విద్యార్థినుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చేనేత కార్మికుల బతుకుల్లో మార్పు

- చేనేత జౌళి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న తెలంగాణ నేతన్న భరోసా, నేతన్న భద్రత, తెలంగాణ నేతన్న పొదుపు-రుణమాఫీ పథకాలతో చేనేత కార్మికుల బతుకుల్లో మార్పు వస్తుందని చేనేత జౌళి, హస్తకళల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్ అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలోని పద్మావతి ఫంక్షన్ హాలులో మంగళవారం చేనేత కార్మికులకు 'నేతన్న భరోసా' పథకం విధివిధానాలపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా శైలజ రామయ్యర్ మాట్లాడుతూ.. ఏడాది కాలంలో కనిష్ఠంగా నాలుగు వార్పులు, 28 చీరలు నేసి వాటిపై తెలంగాణ హ్యాండ్లూమ్ లేబుల్ అంటించి జిల్లా సహాయ సంచాలకుల కార్యాలయానికి పంపితే.. ప్రతి చేనేత కార్మికుడికీ రూ.18,000, అనుబంధ కార్మికులకు రూ.6,000 బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమవుతాయని వివరించారు. రుణమాఫీ, నేతన్న భద్రత గురించి వివరించారు. ఇలాంటి సదస్సు చేనేత కుటుంబాలకు ఎంతో తోడ్పాటు అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో చేనేత జౌళి శాఖ అదనపు సంచాలకులు బి.శ్రీనివాస్‌రెడ్డి, సంయుక్త సంచాలకులు బి.ఇందుమతి, రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ బి.పద్మ, యాదాద్రి భువనగిరి జిల్లా సహాయ సంచాలకులు ఎ.శ్రీనివాస్, నల్లగొండ జిల్లా సహాయ సంచాలకులు ఎస్.ద్వారక, చేనేత శాఖ డిఒలు, ఎడిఒలు, మాజీ అధ్యక్షులు, ఉమ్మడి జిల్లా చేనేత కార్మికులు పాల్గొన్నారు.

ఆందోళన చేస్తున్న విద్యార్థులు

ఓయూ క్యాంపస్‌ను 'క్లోజ్డ్'గా మార్చాలి

- విద్యార్థుల నిరసన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉస్మానియా విశ్వవిద్యాలయాన్ని క్లోజ్డ్ క్యాంపస్‌గా మార్చాలని ఓయూ విద్యార్థులు డిమాండ్ చేశారు. విద్యార్థులు మంగళవారం ఆర్ట్స్ కళాశాల ప్రధాన రహదారిపై రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు మాట్లాడుతూ.. క్యాంపస్‌లోకి బయటి వ్యక్తులు వచ్చి మద్యం పార్టీలు, అసాంఘిక కార్యకలాపాలు చేస్తుండటంతో విద్యా వాతావరణం తీవ్రంగా ప్రభావితమవుతోందని తెలిపారు. అందువల్ల యూనివర్సిటీలోకి ప్రయివేటు వ్యక్తులు రాకుండా క్లోజ్డ్ క్యాంపస్ చేయాలని కోరారు. ఈ క్రమంలో పోలీసులు అక్కడకు చేరుకుని విద్యార్థులను అరెస్టు చేసి లాలాగూడ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఓయూ క్యాంపస్‌లో సోమవారం బయటి నుంచి వచ్చిన కొంతమంది యువకులు మద్యం సేవించి విద్యార్థులపై దాడి చేసినట్టు విద్యార్థులు ఆరోపించారు.

రైల్వే కోచ్ ఫ్యాక్టరీలో స్థానికులకే ఉద్యోగాలు

- సిఐటియు డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ కోసం అనేక ఏండ్లు పోరాడి సాధించుకున్నామని, అందులో ఈ ప్రాంత యువకులకే ఉద్యోగాలు ఇవ్వాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బొట్ల చక్రపాణి అన్నారు. ఉద్యోగాల కల్పనను ప్రయివేటు సంస్థలకు అప్పగిస్తే అడ్డుకుంటామని హెచ్చరించారు. హనుమకొండ జిల్లా కాజీపేట రైల్వే స్టేషన్ ఎదుట మంగళవారం సిఐటియు ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ఏడాది డిసెంబర్ 1 నుంచి రైల్వే కోచ్ ఫ్యాక్టరీ మరమ్మతు పనులను ప్రయివేటు ఏజెన్సీలకు అప్పగించాలని కేంద్ర ప్రభుత్వం యత్నిస్తోందని, దానిని వెంటనే ఉపసంహరించుకొని ప్రభుత్వమే నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ ప్రాంత నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. అనేక సంవత్సరాలుగా చేసిన పోరాటాల ఫలితంగా ఏర్పడిన ఈ ఫ్యాక్టరీలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు భూ నిర్వాసితులతోపాటు స్థానికులకు ఇవ్వాలన్నారు. కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా ఆలోచించాలని, లేనియెడల సిఐటియు ఇతర సంఘాలను కలుపుకొని పెద్దఎత్తున ఆందోళన, పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి కారు ఉపేందర్, నాయకులు జంపాల రమేష్, ఎ.జాన్, రాజు, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

యూరియా పక్కదారి పట్టకుండా చర్యలు

- ఎపిసి కార్యదర్శి సురేందర్ మోహన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో యూరియా పక్కదారి పట్టకుండా అన్ని చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ కార్యదర్శి (ఏపీసీ) సురేందర్ మోహన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్‌లోని వ్యవసాయ శాఖ కార్యాలయం నుంచి డైరెక్టర్ బి.గోపితో కలిసి డిఎఒలు, డిసిఒలు, డిటిఒలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యూరియా పక్కదారి పట్టకుండా నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. యాడ్ బ్లూ యూనిట్లు, రంగులు, ప్లైవుడ్ తదితర వ్యవసాయేతర పరిశ్రమలకు అక్రమంగా రవాణా జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆయా కంపెనీలను తనిఖీ చేయాలని ఆదేశించారు.

యూరియా అక్రమాలపై సమాచారం అందించేందుకు రాష్ట్ర స్థాయిలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూం నెంబర్ (8977741771)ను ఎరువుల షాపులతో పాటు బస్టాండ్లు ఇతర పబ్లిక్ స్థలాల్లో ప్రదర్శించాలని ఆదేశించారు. ప్రయివేట్ ఎరువుల దుకాణాలతో పాటు ప్రాథమిక వ్యవసాయ సహకారం సంఘాల్లో స్టాక్ బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. సరిహద్దు జిల్లాల నుంచి ఇతర రాష్ట్రాలకు యూరియా అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

గవర్నర్‌తో సీతాదయాకర్ రెడ్డి భేటీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్ కొత్తకోట సీతాదయాకర్ రెడ్డి రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మతో భేటీ అయ్యారు. మంగళవారం హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో సమావేశమైన సందర్భంగా వారు బాలల హక్కుల పరిరక్షణ కోసం కమిషన్ తీసుకుంటున్న చర్యలపై చర్చించారు. బాలల హక్కులపై సమాజంలో మరింత అవగాహన పెంచే కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించారు. అణగారిన వర్గాలకు చెందిన చిన్నారుల హక్కుల పరిరక్షణ కోసం ప్రత్యేకంగా శ్రద్ధ పెట్టాల్సిన అవసరాన్ని గుర్తించారు. కమిషన్ చేపడుతున్న కార్యక్రమాల పట్ల గవర్నర్ అభినందనలు తెలిపారు. ఈ సమావేశంలో మహిళా, శిశు సంక్షేమశాఖ, ఉమెన్ సేఫ్టీ వింగ్‌లకు చెందిన సభ్యులు పాల్గొన్నారు.

24న సిరిసిల్లలో కెసిఆర్ కిట్ల పంపిణీ : కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెసిఆర్ జన్మదినం సందర్భంగా ఈ నెల 24న సిరిసిల్లలో కెసిఆర్ కిట్లను పంపిణీ చేయనున్నారు. గిఫ్ట్ ఎ స్మైల్ కార్యక్రమంలో భాగంగా వీటిని ఐదు వేల మంది తల్లులకు అందజేయనున్నట్టు కెటిఆర్ తెలిపారు. కెసిఆర్‌కు మంచి పేరు వస్తుందనే ఉక్రోషంతోనే రేవంత్ ప్రభుత్వం కిట్ల పంపిణీ ఆపేసిందని కెటిఆర్ విమర్శించారు. 20 నెలల నుంచి కిట్లను ఇవ్వకపోవడంతో చాలా మంది తల్లులు బాధపడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కిట్ల పంపిణీ తర్వాత ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవాలకు వచ్చే వారి సంఖ్య పెరిగిందని ఆయన గుర్తుచేశారు. అలాంటి కిట్లను పంపిణీ చేయకపోవడం దుర్మార్గమని కెటిఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

TATA mutual fund

అర్బిట్రేజ్ ఫండ్‌లో రూ.310 కోట్ల పెట్టుబడులు

హైదరాబాద్: స్టాక్ మార్కెట్ అస్థిరతల మధ్య కూడా హైదరాబాద్ పెట్టుబడిదారులు ఏప్రిల్-జూన్ 2025లో టాటా ఆర్బిట్రేజ్ ఫండ్‌లో రూ.310 కోట్లు పెట్టుబడులు పెట్టారని టాటా అసెట్ మేనేజ్‌మెంట్ ఫండ్ మేనేజర్ శైలేష్ జైన్ పేర్కొన్నారు. 2025 ఏప్రిల్-జూన్లు మధ్య ఈ ఫండ్ రూ.5,217 కోట్ల నగదు ప్రవాహాలను నమోదు చేయగా.. హైదరాబాద్ నుంచి రూ.310 కోట్లు వచ్చాయన్నారు. 2025 జూన్ 30 నాటికి ఈ ఫండ్ రూ.14,274 కోట్ల ఆస్తులను కలిగి ఉందన్నారు.

రైతులను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు

- ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ఉచిత ఇసుక
- కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భూ సమస్యల పరిష్కారంలో రైతులను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు తప్పవని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. మంగళవారం హైదరాబాద్‌లోని బిఆర్. అంబేద్కర్ సచివాలయంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌లతో కలిసి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. భూ భారతి, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై కలెక్టర్లకు మంత్రి పలు సూచనలు చేశారు. క్షేత్రస్థాయిలో కొంతమంది అధికారులు రైతులను ఇబ్బంది పెడుతున్నారనే సమాచారం ఉందని, ఇది పునరావృతం కాకుండా చూడాలని కలెక్టర్లకు సూచించారు. రాష్ట్రంలో మూడు దఫాలుగా నిర్వహించిన భూ సదస్సుల్లో 8.65 లక్షల దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. సాదాబైనామా, సర్వేనెంబర్ మిస్సింగ్, అసైన్డ్ ల్యాండ్ రెగ్యులరైజేషన్, సక్సెషన్‌కు సంబంధించి ఆరు లక్షల దరఖాస్తులు వచ్చాయని అన్నారు. వీటిని ఐదు విభాగాలుగా విభజించి ప్రతి దరఖాస్తును సమగ్రంగా పరిశీలన జరిపి ఆగస్టు 15వ తేదీలోగా సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు.. సాదాబైనామాల అంశం ప్రస్తుతం కోర్టు పరిధిలో ఉందనీ, తీర్పుకోసం వేచిచూడకుండా దరఖాస్తులను పరిశీలించి పరిష్కారం కోసం సిద్ధం చేసుకోవాలన్నారు. జిల్లాల్లోని అసైన్డ్ ల్యాండ్ లబ్దిదారుల వివరాలను ఈ నెల 30లోగా ప్రభుత్వానికి పంపించాలని కలెక్టర్లకు సూచించారు. నిజంగానే దరఖాస్తు పరిష్కార యోగ్యం కానప్పుడు అదే విషయాన్ని సంబంధిత వ్యక్తులకు లిఖిత పూర్వకంగా తెలియజేయాలని సూచించారు. ఇందుకు సంబంధించి రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. ఈనెల 27న రాష్ట్ర వ్యాప్తంగా జీపీవోలు, లైసెన్స్‌డ్ సర్వేయర్లకు నిర్వహిస్తున్న పరీక్షకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. పేదవాడి సొంతింటి కల ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో బిల్లుల చెల్లింపులు, ఇసుక, సిమెంట్, స్టీల్ విషయంలో ఎలాంటి ఇబ్బంది కలగకుండా ధరల నియంత్రణ కమిటీలు చురుగ్గా పనిచేసేలా కలెక్టర్లు నిత్యం పర్యవేక్షించాలన్నారు. ఇండ్ల నిర్మాణానికి అవసరమైన ఇసుకను ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్నదనీ, అసలైన లబ్దిదారులకు అందేలా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలన్నారు. ఎల్-1, ఎల్-2, ఎల్-3 జాబితాలతో సంబంధం లేకుండా నిరుపేదలకు ఇండ్లు కేటాయించాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సాధించిన ప్రగతికి విస్తృత ప్రచారం కల్పించాలి

రాష్ట్ర ప్రభుత్వం సాధించిన ప్రగతికి విస్తృత ప్రచారం కల్పించాలని సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయం నుంచి జిల్లా పౌరసంబంధాల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఏడాదిన్నర కాలంలో ఎన్నో ప్రజా సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నప్పటికీ, ఆ మంచి పనులను ప్రజల్లోకి వివరంగా తీసుకెళ్లలేకపోతున్నామని మంత్రి అభిప్రాయపడ్డారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం నాడు అధికారంలో ఉండి చేయని పనులను చేసినట్టుగా గొబెల్స్ ప్రచారం చేసుకుందనీ, ప్రతిపక్షంలోనూ అదే ఒరవడిని కొనసాగిస్తున్నదని తెలిపారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలతో పాటు ప్రజోపయోగ పనులు చేశామనీ, 60 వేల ఉద్యోగాల భర్తీ దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిచినట్టు తెలిపారు.

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం, పేదలకు సన్నబియ్యం, మహిళలకు రూ.500లకే గ్యాస్ సిలిండర్, రైతుభరోసా పెంపు, రుణమాఫీ, ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు, డైట్ ఛార్జీలు 40 శాతం పెంపు, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డుల పంపిణీ చేసినట్టు వివరించారు. గత ప్రభుత్వం పదేళ్లలో చేయని పనులను ఏడాదిన్నరలో చేసినట్టు తెలిపారు. గత పది సంవత్సరాలుగా రేషన్ కార్డుల్లో పేరు నమోదు కోసం ఎదురు చూస్తున్న 15 లక్షల మంది పేదల పేర్లను రేషన్ కార్డుల్లో నమోదు చేసినట్టు వెల్లడించారు. కొత్తగా 7 లక్షల రేషన్ కార్డులిచ్చినట్టు తెలిపారు. భూ సమస్యల పరిష్కారానికి భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చామని గుర్తుచేశారు. ఆర్థికంగా ఇబ్బందులున్నా ప్రజల సంక్షేమం విషయంలో ఎక్కడా రాజీపడబోవడం లేదని తెలిపారు. ఈ సమావేశంలో సమాచార, పౌర సంబంధాలశాఖ కమిషనర్ సీహెచ్.ప్రియాంక, ముఖ్యమంత్రి ప్రజా సంబంధాల అధికారి జి.మల్సూర్, జాయింట్ డైరెక్టర్ జగన్ డిప్యూటీ డైరెక్టర్ మధు పాల్గొన్నారు.

మూడు కిలోల బంగారమే చోరీ

- యుపికి చెందిన దోపిడీ ముఠాపై అనుమానాలు : ఎస్‌పి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సాయి సంతోషి జ్యూవెల్లరీ షాపులో ఆదివారం అర్ధరాత్రి జరిగిన బంగారం దొంగతనం కేసు విచారణను పోలీసులు వేగవంతం చేశారు. దుకాణానికి 100 మీటర్ల దూరంలో మంగళవారం ఓ పాత ఇంటిని గుర్తించారు. ఆ ఇంటిని రెండు నెలల కిందట ఉత్తరప్రదేశ్‌కి చెందిన ఐదుగురు వ్యక్తులు అద్దెకు తీసుకున్నారు. అక్కడే నివాసముంటూ గుట్టుగా రెక్కీ నిర్వహించినట్టు సీసీటీవీ ఫుటేజీలో దృశ్యాలు నమోదైయ్యాయి. ఈ ఐదుగురు పది రోజుల నుంచి ఆ పాత ఇంట్లో కనిపిస్తున్నట్టు స్థానికులు పోలీసులకు తెలిపారు. హైటెక్ బస్టాండ్ వద్ద ఫాస్ట్ ఫుడ్ సెంటర్ పెట్టినట్టు చెప్పిన వారు.. అర్ధరాత్రి వరకు ఇద్దరు ఇంటి బయట కూర్చోవడం, మరికొందరు షూ వేసుకొని అటు ఇటు తిరగడం స్థానికుల్లో అనుమానాలు రేకెత్తించాయి. ఈ బంగారం దొంగతనం ఘటనతో వీరిపై అనుమానాలు మరింత బలపడ్డాయి. ఆ ఇంటిని పోలీసులు తనిఖీ చేసిన సమయంలో చిన్న చిన్న బంగారం పూసలు లభించాయి. ఇంట్లో ఒక చాప మాత్రమే ఉండగా.. గోడలు, తలుపులపై క్లూస్ టీం, ఫోరెన్సిక్ బృందాలు ఆధారాలు సేకరిస్తున్నాయి. పక్కింటివారి ద్వారా ఉత్తరప్రదేశ్ వ్యక్తుల వివరాలు సేకరించారు. ప్రస్తుతం ఐదుగురు కనిపించకుండా పోయారు. వీరి కోసం ప్రత్యేక పోలీసు బృందాలు గాలింపు చేపట్టాయి.

బంగారం దుకాణంలో తొలుత రూ.18 కోట్ల విలువైన 18 కిలోల బంగారం పోయిందని భావించినా.. అనంతర దర్యాప్తులో మూడు కిలోలు మాత్రమే చోరీ అయినట్టు తేలిందని ఎస్‌పి నర్సింహా తెలిపారు. లాకర్ గదిలో ఆరున్నర కిలోల బంగారం అలాగే ఉందన్నారు. వెనుక భాగంలో రెండు బాత్‌రూమ్‌ల మధ్యనున్న గోడను కూల్చి లోపలికి ప్రవేశించిన దొంగలు బంగారాన్ని అపహరించారు. దుకాణం చుట్టుపక్కల నివాసాలు లేకపోవడంతో ఎవరూ గమనించలేదు. ఇతర దుకాణాల వెనుక భాగాన అంతా నిర్మానుష్యంగా ఉండటంతో అక్కడి నుంచి చోరీకి ప్లాన్ వేశారు. లోపలికి ప్రవేశించే ముందు సీసీటీవీ కెమెరాను దొంగలు డిస్‌కనెక్ట్ చేశారు. స్ట్రాంగ్ రూంలో ఉన్న బంగారం, డబ్బును మాత్రమే దొంగిలించారు. షాపులో మరో 6 కిలోల వరకు బంగారం ఉండగా, సీసీటీవీ కెమెరాలు ఉంటాయన్న అనుమానంతో దొంగలు జాగ్రత్త పడ్డారు. దొంగతనం చేశాక గ్యాస్ కట్టర్, సిలిండర్లను అక్కడే వదిలేసి వెళ్లిపోవడంతో ఇది ప్రొఫెషనల్ దొంగల పని కాదని పోలీసులు అనుమానిస్తున్నారు. దుండగులు పారిపోయే క్రమంలో 2 తులాల రింగ్, చెవిదిద్దులు దారిలో పడిపోగా.. వాటిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇదిలావుండగా, అదే రాత్రి 3:25 గంటలకు ఐదుగురు దొంగలు తాము ఉన్న అద్దె ఇంటి నుంచి భుజాలపై బ్యాగ్‌లు మోసుకుంటూ వెళ్తున్న దృశ్యాలు సీసీటీవీ ఫుటేజీలో రికార్డు అయ్యాయి. ప్రస్తుతానికి యుపికి పోలీసు బృందాలను పంపినట్టు తెలుస్తోంది.

రజక, నాయీబ్రాహ్మణుల పెండింగ్ విద్యుత్ బిల్లులు చెల్లిస్తాం

- ఉప ముఖ్యమంత్రి భట్టి హామీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని రజక, నాయీబ్రాహ్మణుల ఉచిత కరెంటుకు సంబంధించిన పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని రజక వృత్తిదారుల సంఘం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో మాజీ ఎమ్మెల్యే, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పైళ్ల ఆశయ్యతో కలిసి ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు వినతిపత్రం అందజేశారు. రజక, నాయీబ్రాహ్మణులకు ఉచిత విద్యుత్ పథకం బకాయిలు చెల్లించాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా 141 మున్సిపాలిటీల్లో మోడ్రన్ దోబీఘాట్లు మంజూరయ్యాయనీ, తిరిగి వాటి నిర్మాణాలకు అనుమతులివ్వాలని విజ్ఞప్తి చేశారు. ఉచిత విద్యుత్ పథకం అమలు కానీ లబ్దిదారులు చాలా మంది ఉన్నారని తెలిపారు. షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదాల బారిన పడుతున్న వృత్తిదారులకు రూ.ఐదు లక్షల బీమా పథకాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని డిప్యూటీ సిఎం హామీ ఇచ్చినట్టు ఆశయ్య ఒక ప్రకటనలో తెలిపారు.

పిపిపి విధానంలో 27 టూరిస్టు ప్రాంతాల అభివృద్ధి

- పర్యాటక శాఖ సమీక్షలో మంత్రి జూపల్లి కృష్ణారావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రభుత్వ, ప్రయివేట్ భాగస్వామ్యంతో రాష్ట్రంలోని 27 టూరిస్టు ప్రాంతాలను అభివృద్ధి చేస్తున్నట్టు పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టిజిటిడిసి) కార్యాలయంలో ఆ సంస్థ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డితో కలిసి రాష్ట్రంలో పర్యాటక రంగం అభివృద్ధిపై సమీక్ష నిర్వహించారు. టూరిస్టు ప్రాజెక్ట్ పనుల స్థితిగతులు, బడ్జెట్ హోటళ్లు, పెండింగ్ పనులు, మొదటి దశలో కొత్తగా చేపట్టబోయే ప్రత్యేక పర్యాటక ప్రాంతాల అభివృద్ధి గురించి అధికారులు మంత్రికి వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలోని ప్రపంచ స్థాయి పర్యాటక ప్రదేశాలను గుర్తించి, టూరిజం డెస్టినేషన్ సెంటర్లుగా తీర్చిదిద్దాలని అధికారులను ఆదేశించారు. పర్యాటక రంగం ద్వారా ఆర్థిక పురోభివృద్ధి, ఉపాధి కల్పన, సాంస్కృతిక మార్పిడి పెంపొందించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. 'ప్రయివేటు హోటళ్లు, ట్రావెళ్లకు ధీటుగా ఆదాయం పెంచుకోవాలి. బోనాలు, బతుకమ్మ, సమ్మక్క-సారాలమ్మ, నాగోబా జాతరలను ఘనంగా నిర్వహించడం ద్వారా దేశీయ, అంతర్జాతీయ పర్యాటకులను ఇక్కడికే రప్పించేలా చర్యలు తీసుకోవాలి" అని అధికారులకు సూచించారు. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన రియో కార్నివాల్ తరహాలో తెలంగాణలో అంతర్జాతీయ కార్నివాల్ నిర్వహణకు ప్రతిపాదనలు రూపొందించాలని జూపల్లి ఆదేశించారు. వాటర్ స్పోర్ట్స్‌లో సాహస క్రీడలకు ప్రాధాన్యతనివ్వాలనీ, అవసరమైతే ఇతర రాష్ట్రాలకు వెళ్లి అధ్యయనం చేయాలన్నారు.